క్లుప్తంగా...

పెరిగిన నాంపల్లి పోలీసు స్టేషన్ పరిధి

నాంపల్లి: శాంతిభద్రతల పోలీసు స్టేషన్ పరిధి కొంతమేర పెరిగింది. ఇటీవల జరిగిన పోలీసు స్టేషన్ల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ఈ మార్పులు జరిగాయి. నాంపల్లి పోలీసు స్టేషన్‌కు అదనంగా మరికొంత భౌగోళిక విస్తీర్ణం వచ్చి చేరింది. సెక్టార్–1 ప్రాంతంలోకి హ్యుమయూన్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని కొంత భాగాన్ని నాంపల్లి పోలీసు స్టేషన్‌లోనికి కలిపారు. కొత్తగా కలిసిన ప్రాంతాల్లో జేఎన్టీయూ, పాలిటెక్నిక్ కళాశాల, శాంతి నగర్, మత్స్యశాఖ కార్యాలయాలు, మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణాలు ఉన్నాయి. మిగతా సెక్టార్లలోని ప్రాంతాలు యథావిధిగా నాంపల్లిలోనే ఉన్నాయి.

ఎంపీ అసదుద్దీన్‌ను కలిసిన మజ్లిస్ నాయకులు



గోల్కొండ: మజ్లిస్‌కు మించిన సెక్యులర్ పార్టీ మరేది లేదని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ అన్నారు. బుధవారం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన పలువురు మజ్లిస్ నాయకులు ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ఆధ్వర్యంలో ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ మాట్లాడుతూ మజ్లిస్ పార్టీ దశాబ్దాలుగా ప్రజా సేవలో ఉందని అన్నారు. పార్టీ సెక్యులర్ విధానాల వల్లే నేడు ఆ పార్టీకి ఇతర రాష్ట్రాల్లో సైతం ప్రజాదరణ మెండుగా లభిస్తుందన్నారు.

దిలీప్‌రెడ్డికి దేవులపల్లి రామానుజరావు పురస్కారం

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ పాత్రికేయులు ఆర్.దిలీప్‌రెడ్డికి 2023 సంవత్సరానికి గాను డాక్టర్ దేవులపల్లి రామానుజరావు పురస్కారాన్ని అందజేయాలని తెలంగాణ సారస్వత పరిషత్ నిర్ణయించినట్లు తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్ష కార్యదర్శులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, జె.చెన్నయ్యలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు తెలుగు దిన పత్రికలలో వివిధ హోదాలలో సేవలందించడమే కాకుండా సమాచార హక్కుచట్టం కమిషనర్‌గా, పర్యావరణ వేత్తగా విశిష్ట సేవలందించిన దిలీప్‌రెడ్డికి ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీన రూ.25 వేల నగదు, జ్ఞాపికతో సత్కరించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

విజయనగర్‌కాలనీ: విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని తెలంగాణ రాష్ట్ర ఆర్‌టీఐ కమిషనర్ డాక్టర్ మహ్మద్ అమీర్ అన్నారు. విజయనగర్‌కాలనీ నారాయణ ఈ టెక్నో పాఠశాలలో బుధవారం ఇన్వెస్టిట్యూర్ సెర్మని వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కొత్తగా ఎన్నికైన స్కూల్ లీడర్లకు బ్యాడ్జీలు అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... విద్యార్థి దశలోనే ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని చేరుకునేంత వరకు కృషి, పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. మహ్మద్ ఫయాజ్‌ఉద్దీన్, నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచితంగా బస్‌పాస్‌ల పంపిణీ

సంతోష్‌నగర్: వీకేవీ ఫౌండేషన్ నిర్వాహకురాలు వి.కృష్ణవేణి ఆధ్వర్యంలో బుధవారం బడంగ్‌పేట్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలకు చెందిన 20 మంది పేద విద్యార్థులకు ఉచితంగా బస్ పాస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా పాస్‌లను అందజేసినందుకు నిర్వాహకులు కృష్ణవేణిని శాలువాతో ఘనంగా సత్కరించారు.

గౌలిపురలో అన్నదానం

గౌలిపురా: ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా ఆధ్వర్యంలో అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని గౌలిపురా బతుకమ్మ బావి వద్ద ఉన్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో బుధవారం పరమశివునికి విశేష పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీరాం కోటయ్య గుప్తా, సలహదారులు చీల రాములు గుప్తా, సరాబు విశ్వేశ్వరయ్య గుప్తా, అధ్యక్షులు శ్రీధర మల్లికార్జున్ గుప్తా పాల్గొన్నారు.

రక్తదానం శిబిరం

జియాగూడ: తలసెమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించడం హర్షణీయమని బీజేపీ సీనియర్ నాయకుడు గోవింద్‌రాఠి అన్నారు. బుధవారం సబ్జిమండి గంగపుత్ర సంఘంలో రక్తదాన శిబిరం ఏర్పాటైంది. ఇందులో 102 మంది రక్తదానం చేశారు. సంఘం అధ్యక్షులు ఆంనందేశి, విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి విజయ్ ఆనంద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

జియాగూడ: జియాగూడలోని రంగనాథ్ నగర్‌లో రోడ్లను వేయాలని కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ కలిసి వినతి పత్రం అందజేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కావూరి వెంకటేష్, జియాగూడ డివిజన్ అధ్యక్షుడు నరహరిచారి, బీఆర్ఎస్ కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో అభివృద్ధి పనులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ఎప్పుడు, ఎక్కడ సమస్యలు తలెత్తిన కూడా వెంటనే దానిని పరిష్కరిస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన కార్వాన్, లంగర్‌హౌజ్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి తాను ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటున్నానని అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు తాను క్రమం తప్పకుండా తన కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అంతే కాకుండా మజ్లీస్ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులతో



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

కలిసి ఇంటింటికి మజ్లిస్ కార్యక్రమం నిర్వహిస్తు నేరుగా ప్రజల ఇంటికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు.

బాధితుడికి పరిహారం అందజేత



బాధితుడికి చెక్కును అందజేస్తున్న సివిల్ కోర్టు చీఫ్ జడ్జి తదితరులు

యాకుత్‌పురా: మోటార్ వాహన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి శాశ్వత వైకల్యానికి గురైన ఉదయ్‌కుమార్ అనే బాధితుడికి బుధవారం సిటీ సివిల్ కోర్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితుడికి నష్ట పరిహారాన్ని అందజేశారు. హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ రేణుకా యారా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కేసుపై సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుకా యారా ఇరుపక్షాలతో చర్చలు జరిపి ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడికి రూ.1.50 కోట్ల నష్ట పరిహారాన్ని నిర్ణయించారు. అనంతరం మగ్మా హెచ్‌డీఐ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కరణ్ పురోహిత్, చీఫ్ జడ్జి రేణుకా యారాలు బాధితుడికి నిర్ణయించిన నష్ట పరిహారం చెక్కును అందజేశారు. ఈ ప్రీ లోక్ అదాలత్‌లో ఇన్సూరెన్స్ కంపెనీకి చెందిన న్యాయవాదులు విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రీధర్ యాదవ్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు



అబిడ్స్: గోషామహాల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌడుగు శ్రీధర్ యాదవ్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని నగర మార్కెటింగ్ మాజీ డైరెక్టర్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. గోషామహాల్‌లో శ్రీధర్ యాదవ్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సదర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ.... గత 30 సంవత్సరాలకుపైగా కాంగ్రెస్ పార్టీలో కీలక నాయకుడిగా ఉండి గోషామహాల్ నియోజకవర్గంలో పార్టీ పటిష్ఠతకు, ప్రజా సేవకు ఆయన చేసిన కృషి అమోఘమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌడుగు మధుయాదవ్, కె.శ్రీధర్, సి.రామ్, యోగి తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయ్‌కి ఘన నివాళి

అబిడ్స్: భారతరత్న, దివంగత మాజీ ప్రధాని అటల్ బీహారి వాజ్‌పేయి వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కట్టెలమండిలోని బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర బీజేపీ కోఆర్డినేటర్ డి.గోపాల్‌జీ, రాష్ట్ర నాయకులు ఉమాశంకర్, డిసి.శేఖర్, మురళీధర్ గౌడ్ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా డి.గోపాల్‌జీ మాట్లాడుతూ.... దేశ అభివృద్ధికి, ప్రపంచంలోనే భారత్‌ను అగ్రగామిగా తీర్చడంలో వాజ్‌పేయి చేసిన సేవలు అమోఘమని కొనియాడారు.



కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

సుల్తాన్‌బజార్: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఎఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో ఆగస్టు 15 నుండి సమ్మెకు పిలుపునిచ్చారు. బుధవారం కోఠిలోని ఫ్యామిలీ వెల్ఫేర్ కమీషనర్ కార్యాలయ ఆవరణలో పెద్ద ఎత్తున ఏఎన్ఎంలు ధర్నా చేశారు. ఈ ధర్నాకు సీఐటీయు యూనియన్ రాష్ట్ర నాయకులు బలరాం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.... రాష్ట్రంలో కాంట్రాక్టు పద్ధతిలో ఏఎన్ఎంలు గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికి వీరిని రెగ్యులర్ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. సీఐటీయు నగర అధ్యక్షులు కుమారస్వామి తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర నాయకులు కవిత పాల్గొన్నారు.

సమాజ సేవకే టీఎన్జీఓ అంకితం

అబిడ్స్: సమాజ సేవకు తన జీవితం అంకితమని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేన్ పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఆయన చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి ది న్యూస్ యు లైక్ ఆగ్ల మ్యాగజైన్ సంస్థ భారతశ్రీ అన్సోల్ అవార్డును ఎస్ఎం ముజీబ్ హుస్సేనికి ప్రకటించింది. బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారులు ఏకే.ఖాన్ డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేన్‌కు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తమ ఉద్యమ సంఘం బంగారు తెలంగాణలో కూడా తమ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.



కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి



అఫ్జల్‌గంజ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు స్థానిక కమిటి ఆధ్వర్యంలో గౌలిగూడ చమన్ వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. బోనాల శ్రీనివాస్ హాజరై వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించడం అధికారంలో ఉన్న ప్రభుత్వాల బాధ్యత అని గుర్తుచేశారు. దీక్షలో కూర్చున్న తుపాకి అంజనేయులు, బి గంగపురి, ఎన్ వెంకటేష్, కోట సత్యనారాయణ, వేముల అంజయ్య, కె హన్మంతు, పి భాగ్యమ్మ, వి శ్రీశైల, ఏ శంకర్‌లకు గోషామహల్ జోన్ సిఐటియు కన్వీనర్‌తో కలిసి పూల మాల వేసి మద్దతు ప్రకటించారు.

చైన్‌స్నాచింగ్

సుల్తాన్‌బజార్: షాపింగ్ అని వచ్చిన ఓ మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును స్నాచింగ్ చేసిన దొంగలను సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ముత్తు తెలిపిన మేరకు.. తిప్పర్తి నాగమ్మ అనే మహిళ తన కూతురుతో సోమవారం సుల్తాన్ బజార్ జైన్ మందిర్ వద్ద షాపింగ్ చేస్తుండగా ఓ మహిళ నాగమ్మ మెడలో నుంచి బంగారు గొలుసును తెంపుకొని ఓ వ్యక్తితో బైక్‌పై పారిపోయింది. తేరుకున్న నాగమ్మ స్థానికుల సహాయంతో సుల్తాన్‌బజార్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజ్ ఆధారంగా ఓ మహిళ మరో వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా బంగారు గొలుసును వారే తెంపుకున్నారని తేలింది. మొదటి నిందితురాలు పూజ అతుల్ పాండే, శరీర్ ఖాన్ అలియాస్ జబ్బర్‌ఖాన్ అని తేలడంతో ఇద్దరిని సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద రెండు తులాల బంగారు గొలుసులు, ద్విచక్ర వాహనం, 100 గ్రాముల కారంపొడిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు ,చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళతో అసభ్య ప్రవర్తన.. నిందితుడికి జైలు



మహ్మద్ ఇర్ఫాన్ అలీ

సంతోష్‌నగర్: మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తికి బుధవారం నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్ రావు 16 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన మేరకు.. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇర్ఫాన్ అలీ (26) ఓ మహిళ నడుచుకుంటూ వెళుతుండగా... ఆమె వెనుక నుంచి చేతులతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు మహ్మద్ ఇర్ఫాన్ అలీని అరెస్ట్ చేసి ఈ–పెట్టి కేసు నమోదు చేశారు. అనంతరం మహ్మద్ ఇర్ఫాన్ నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరు పరచగా.. మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్ రావు ఇర్ఫాన్ అలీకి 16 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

బోర్డు తిప్పేసిన ట్రావెల్ ఏజెన్సీ

గన్‌ఫౌండ్రీ: అబిడ్స్‌లోని ఖాన్ లతీఫ్‌ఖాన్ భవనంలో గత కొన్ని సంవత్సరాలుగా సీపీఎస్ కార్పొరేట్ సొల్యూషన్ పేరుతో నిర్వహిస్తున్న ట్రావెల్ ఏజెన్సీ బోర్డు తిప్పేసిన ఘటన బుధవారం అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అబిడ్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..... గత కొన్ని సంవత్సరాలుగా ట్రావెల్ ఏజెన్సీ నిర్వహిస్తున్న కుతుబ్‌ద్దీన్ అమెరికా, యుకే, కెనడా దేశాలకు వెళ్లే విద్యార్థులకు టికెట్స్ బుక్ చేసేవాడు. ఈ క్రమంలో 30 మంది విద్యార్థుల నుంచి విదేశాలకు టికెట్స్ బుక్ చేస్తానంటూ లక్షల్లో డబ్బులు వసూలు చేసి పరారయ్యాడు. దీంతో బాధితులు అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: సాహిత్య, రచయితలు నడిచే గ్రంథాల్లాంటి వారని శాసన మండలి సభ్యులు గోరటి వెంకన్న అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో డాక్టర్ యాటెల్లి ఈశ్వర్ రచించిన తూర్పు బజార్లం, కన్యాకుమారి దీపకలిక, తెలంగాణ యాస, బాస పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ద్రావిడ కాలంలో యాత్రా విశేషాలను, ప్రస్తుత కాలంలో తెలంగాణ విశేషాలను తెలుపుతూ..... పుస్తకాలను తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య యువ పురస్కార గ్రహీత పసునూరి రవీందర్, ప్రముఖ కవి పొన్నాల బాలయ్య, రచయిత కట్కూరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలి



జియాగూడ: రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కుల్సుంపురా ఏసీపీ జావీద్ అన్నారు. బుధవారం జియాగూడ ధార్మిక్ ఉత్సవ సమితి చైర్మన్ మహేష్కర్ కాంతిలాల్, ప్రధాన కార్యదర్శి మాణిక్ ప్రభు తదితరులు ఏసీపీ జావీద్‌ను ఘనంగా సన్మానించారు. జియాగూడ ధార్మిక్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని మండపాలకు కావాల్సిన సదుపాయాలు, స్వాగత వేదికలు శాంతియుతంగా ఊరేగింపులు నిర్వహించడానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు.

రాహుల్‌గాంధీని ఎమ్మెల్సీ కవిత విమర్శించడం విడ్డూరం

అబిడ్స్: కాంగ్రెస్ అగ్రనాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీని ఎమ్మెల్సీ కె.కల్వకుంట్ల కవిత విమర్శించడం విడ్డూరంగా ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని కవిత అప్పుడే మర్చిపోయారని విమర్శించారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ...... బీజేపీ బి టీమ్‌గా బీఆర్ఎస్ వ్యవహరిస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని గౌరీ సతీష్ పేర్కొన్నారు.

వాజ్‌పేయికి నివాళి



గోల్కొండ: భారతరత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పాయి భారతమాత ముద్దుబిడ్డలలో ఒకరని బీజేపీ నాయకులు దేవర వంశీ అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్‌లోని జనహిత్ కార్యాలయంలో వాజ్‌పేయి వర్థంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఆయన సేవలను కోనియాడారు. బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, రాధాకృష్ణ యాదవ్, ప్రభు పూజారీ, సుధాకర్‌యాదవ్, నాగరాజు, శ్రీకాంత్‌సాగర్ తదితరులున్నారు.

గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



గోల్కొండ: సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని సబ్జిమండి గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ఆనందేశీ విజయకిషోర్ అన్నారు. బుధవారం కార్వాన్ సబ్జిమండిలోని గంగపుత్ర భవనంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం చేపట్టవలసిన కార్యక్రమాలు, తదితర విషయాలపై చర్చించారు. ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, మరింత ఎక్కువ సంఖ్యలో నిర్వహిస్తామని సంఘం అధ్యక్షుడు తెలిపాడు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, సలహాదారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు శిక్షణ శిబిరం

చార్మినార్: మహిళల్లో సాధికారతను, స్వయం చోదక శక్తిని పెంపొందించడానికి ప్రభుత్వ సిటీ కళాశాల మహిళా సాధికారత విభాగం, మోవో సంస్థతో కలిసి ద్విచక్ర వాహన చోదక నైపుణ్యాన్ని విద్యార్థుల్లో పెంపొందించడానికి మూడు రోజుల ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో మోవో డైరెక్టర్ నమ్రత, శిక్షకురాలు ధరణి విద్యార్థులకు ద్విచక్ర వాహనంపై అవగాహనను పీపీటీ ద్వారా ప్రదర్శించారు. ప్రారంభ సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ అధ్యక్షతన వహించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ వి.శ్రీదేవి సుజాత, డాక్టర్ నర్మద, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ సుదక్షణ, వేదవతి, డాక్టర్ చిత్తరంజన్, డాక్టర్ ఆనంద్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గన్‌ఫౌండ్రీ : విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగులకు తగిన న్యాయం చేయాలని వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ నిరుద్యోగ సంఘం ఆధ్వర్యంలో సమగ్ర ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ..... విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించగా వారిని అరెస్టు చేసి గోషామహాల్ పోలీస్ స్టేడియానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సమగ్రశిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ ఇన్సూరెన్స్, మినిమం పే స్కేల్ చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను తెలిపేందుకు వచ్చినటువంటి ఉద్యోగులను ఎక్కడికక్కడ అరెస్టు చేయడం సరికాదన్నారు. అనంతరం ఉద్యోగులను సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు స్వరూపరాణి, బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గోషామహాల్ పోలీస్‌స్టేడియంలో ఆందోళనలో పాల్గొన్న గుజ్జకృష్ణ తదితరులు

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న యువకులు

గోల్కొండ: రక్తదానానికి మించిన దానం మరేది లేదని వీరంచి ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ మాధవి లత అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకోని కార్వాన్ సబ్జిమండి గంగపుత్ర సంఘం, గంగపుత్ర యువజన సంఘం తలసేమియా అండ్ సికిల్ సెల్ సోసైటీ వారు సంయుక్తంగా గంగపుత్ర భవనంలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై తన రక్తాన్ని దానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తలసేమియా వ్యాధి గ్రస్తులకు రక్తదానం చేయడానికి యువత ముందుకు వచ్చి ఇతరులకుఆదర్శంగా నిలవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో కార్వాన్ నియోజకవర్గానికి చెందిన సుమారు 100 మంది యువతి, యువకులు ముందుకు వచ్చి రక్తాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ఏ.విజయకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



గోల్కొండ: విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఆసిఫ్‌నగర్ ఎస్ఐ పి.రిమా అన్నారు. గుడిమల్కాపూర్‌లోని నారాయణ ఈ టెక్నో స్కూల్‌లో క్యాబినేట్ ఇస్టాలేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలంటే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, ధైర్యంగా సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఏజీఎం ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఫర్హానా మొబిన్, ఆర్ఐ నవీన్‌కుమార్, చంద్రశేఖర్, కో ఆర్డినేటర్ ఫర్హానా పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

గన్‌ఫౌండ్రీ: భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఎంతగానో ఉందని పలువురు ప్రముఖులు అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హెవెన్ హోమ్స్ సొసైటీ 11వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేటితరానికి సాంప్రదాయ వస్త్రధారణ ప్రాముఖ్యతను తెలిపే విధంగా నిర్వహించిన ట్రెడిషనల్ ర్యాంప్ వాక్, సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ రంగాలలో సేవలందిస్తున్నటువంటి పలువురికి సేవా భారత అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.వేణుగోపాల చారి, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పాల్గొన్నారు.



హిందూ శ్మశాన వాటికను కబ్జా నుంచి కాపాడాలి



చాంద్రాయణగుట్ట: లలితాబాగ్ హిందూ శ్మశాన వాటికను కబ్జా బారి నుంచి కాపాడాలని బీజేపీ సీనియర్ నాయకులు తాడెం శ్రీనివాసారావు కోరారు. బుధవారం ఆయన బండ్లగూడ తహసీల్దార్ జయమ్మ, జీహెచ్ఎంసీ ఉప కమిషనర్, సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్లకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....4.25 ఎకరాలుగా ఉన్న లలితాబాగ్–ఈదిబజార్ రహదారిలో ఉన్న శ్మశాన వాటికను దర్జాగా చదును చేస్తున్నారు. సమాధులను సైతం తొలగించి పైప్‌లైన్ పనులు చేయడం తమ మనోభావాలతో ఆడుకోవడమేనన్నారు. వెంటనే ఆయా పనులను ఆపించి...కబ్జాకు యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అతనితో పాటు హిందూ శ్మశాన వాటిక కమిటీ ప్రతినిధి అశోక్ కుమార్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి



చార్మినార్: మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీని బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేసి శాలువాతో సత్కరించిన తాను ముస్లిం ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరినట్లు టీ–టీడీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడు హబీబ్ మహ్మద్ అల్ హైద్రూస్ తెలిపారు. తాను మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తారీఖ్ అన్సారీని కలిసి మైనార్టీ ప్రజల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించినట్లు ఆయన తెలిపారు.

సమస్యల పరిష్కానికి కృషి



అఫ్జల్‌గంజ్: బేగంబజార్ డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కానికి కృషి చేస్తున్నామని ఆ డివిజన్ కార్పొరేటర్ గొంటి శంకర్ యాదవ్ అన్నారు. ఈ మేరకు బుధవారం బేగంబజార్ డివిజన్‌లోని జగన్నాథ్ ద్వారాలో అధికారులు, పార్టీ నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

పీఆర్‌సీ ఎరియర్స్‌తో పాటు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఏలూరి యాదయ్య

చార్మినార్: ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఉపాధ్యాయులతో పాటు యూనివర్సిటీ ఉపాధ్యాయులకు పీఆర్‌సీ ఏరియర్స్‌తో పాటు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అఖిల భారత రాష్ట్రీయ సైక్షిక్ మహా సంఘం (ఏబీఆర్ఎస్ఎం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఏలూరు యాదయ్య డిమాండ్ చేశారు. ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బుధవారం సిటీ కాలేజీలో సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంఘం జాతీయ సహాయ కార్యదర్శి డాక్టర్ గుంతా లక్ష్మణ్ సలహాలు,సూచనల మేరకు వివిధ ప్రభుత్వ అధికారులను,ప్రజా ప్రతినిధులను కలిసి ప్రభుత్వ కాలేజీలు,యూనివర్సిటీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి క్రుషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఎంపీలు బండి సంజయ్,పి.రాములు, సోయం బాబురావు తదితరులను కలిసి వినతి పత్రాలను అందజేశామన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు డాక్టర్ జగన్,డాక్టర్ భాస్కర్,డాక్టర్ నరేష్ పాల్గొన్నారు.